క్లుప్తంగా

నేడు మూడు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం

అడ్డతీగల: మండలంలోని పింజరికొండ, చిన్న అడ్డతీగల, చేనుపాకలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎల్లవరంలోని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

గణిత ఉపాధ్యాయులను నియమించాలి

ఎటపాక: మండలంలోని సీతాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులను నియమించాలని పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ అలివేలుమంగమ్మ శుక్రవారం కోరారు. పాఠశాలలో ఉన్న గణిత ఉపాధ్యాయురాలు బదిలీపై వెళ్లి మూడునెలలు గడుస్తున్నా మరొకరిని ఇక్కడ నియమించకపోవడంతో బోధన నిలిచిపోయిందని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులతో పాటు మిగత తరగతుల వారుకూడా నష్టపోతున్నారని చెప్పారు.

హెచ్‌ఎం మృతికి సంతాపం


చలపతిరావు (ఫైల్)

వీఆర్‌పురం: మండలంలోని నూతిగూడెం జీపీఎస్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కూరా చలపతిరావు(55) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందారు. ఉదయం ఆయన రామవరంలో తన ఇంటి వద్ద ఉండగా గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు కోతులగుట్ట ప్రభుత్వాపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చలపతిరావు మరణించారు. ఆయనకు భార్య శాంతకుమారి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. హెచ్‌ఎం మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

ఈక్రాప్ సామాజిక తనిఖీపై గ్రామ సభ


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ ఏవో ఉషారాణి

వై.రామవరం: స్థానిక రైతుభరోస కేంద్రంలో శుక్రవారం వ్యవసాయశాఖ ఏవో ఉషారాణి ఆధ్వర్యంలో ఈక్రాప్ సామాజిక తనిఖీపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈక్రాప్ ఆధారంగానే పంటలు కొనుగోలు ఉంటుందన్నారు. ఈక్రాప్ సామాజిక తనిఖీల జాబితాను నోటీసు బోర్డులో ఉంచామన్నారు. ఏమైన తప్పులుంటే తెలియపరచాలని తెలిపారు. గ్రామ సచివాలయాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ఫ్రీడమ్‌రన్


రన్‌లో పాల్గొన్న పోలీసులు

వై.రామవరం: సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో శుక్రవారం వై.రామవరంలో ఫిట్ ఇండియా ఫ్రీడమ్‌రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో 4 కె ఎమ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగునికి ట్రై సైకిల్ అందజేత

చింతపల్లిరూరల్: అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి, నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ శివప్రసాద్ దంపతులు ఓ దివ్యాంగునికి ట్రై సైకిల్ వితరణగా అందజేశారు. గూడెంకొత్తవీధి మండలం కడుగుల గ్రామానికి చెందిన దివ్యాంగుడు కామేశ్వరరావు వినియోగించే ట్రై సైకిల్ పాడైపోవడంతో ఆయన పడుతున్న ఇబ్బందిని స్థానిక పాత్రికేయులు శివప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే స్పందించారు. కామేశ్వరరావుకి ట్రై సైకిల్‌ను స్థానిక పాత్రికేయుల చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సత్వర వైద్యం


గిరిజనులకు మందుల కిట్లను పంపిణీ చేస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు


ఇంజరిలో రోగులను పరీక్షిస్తున్న వైద్య నిపుణులు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం

సాక్షి, పాడేరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలతో గిరిజనులకు సత్వరమే వైద్య సేవలందుతున్నాయని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు తెలిపారు. డోకులూరు ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యుల పరీక్షల అనంతరం రోగులకు మందుల కిట్లను బుల్లిబాబు, ఇతర నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సన్నిబాబు, ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ, వైఎస్సార్‌సీపీ పాడేరు పట్టణ అధ్యక్షుడు డి.పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: ప్రజారోగ్యానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని స్థానిక ఎంపీడీవో ఎల్. పూర్ణయ్య తెలిపారు. మండలంలోని అతిమారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఇంజరి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీవో, సర్పంచ్ గెమ్మెలి రవణమ్మ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అందరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్ మాట్లాడుతూ పేదలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. గతంలో ఎన్నడూ మా గ్రామాలకు ప్రత్యేక వైద్య నిపుణులు వచ్చి


రంపచోడవరంలో మాట్లాడుతున్న సర్పంచ్ బొజ్జయ్య

వైద్యసేవలందించిన దాఖలాలు లేవని తెలిపారు. ఈ శిబిరంలో 325 మందికి వైద్య సేవలు పొందారు. ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో పోషకాహారం ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఇద్దరు గర్భిణులకు సీమంతం చేశారు.ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు సర్వేశ్వరరావు, కిశోర్‌కుమార్, కిరణ్‌కుమార్, ఈవోఆర్డీ నరసింగరావు, ఆర్‌ఐ సింహాచలం, మాజీ సర్పంచ్ వంతాల కామేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని గత్తుంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఆరోగ్యవంతులుగా ఉండాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. 421 మందికి వైద్యసేవలు అందించినట్టు వైద్యాధికారులు అనుషా, ప్రశాంత్, నివేదికలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు, ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్రమణిదేవి, ఈవోపీఈఆర్డీ అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షుడు దిలిఫ్‌కుమార్, మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మెన్ ఎస్.కొండలరావు, సర్పంచ్ పాడి పోతురాజు,ఎంపీటీసీ సభ్యురాలు కొండమ్మ,నాయకులు కె.రామకృష్ణ, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: పేదలందరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని స్థానిక సర్పంచ్ మంగా బొజ్జయ్య తెలిపారు. రంపచోడవరం గ్రామ పంచాయతీ పరిధిలోని సచివాలయం -2లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఎంపీడీవో బి.బాలకృష్ణ, ఈవోపీఆర్డీ ఎన్. జాన్ మిల్టన్ , పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్, సచివాలయం కార్యదర్శి నారాయణ రెడ్డి, వైద్యాధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలన


సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ అనంతబాబు

రాజవొమ్మంగి: సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన సాగుతోందని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేనంతగా ప్రజల మనోభావాలకు తగినట్టుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను అందిస్తున్నారని తెలిపారు. మండలంలోని అమీనాబాద్ సచివాలయం పరిధిలోని మూడు గ్రామాల్లో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సుమారు 300 గడపలకు వెళ్లి ప్రతి ఒక్కరిని పేరుపేరున పలుకరించారు. లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా వివరించారు. పంచాయతీలో ఈ నాలుగు సంవత్సరాల్లో సుమారు రూ. 7 కోట్ల విలువైన సంక్షేమ ఫలాలు అందజేయగా ఒక్కో కుటుంబానికి సుమారు రూ.60వేల నుంచి రూ. 2.6 లక్షల వరకు లబ్ధిచేకూరిందని తెలిపారు. మరో రూ. 2 కోట్లతో నాడు-నేడు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, సీసీ రోడ్లు నిర్మించినట్టు తెలిపారు. ప్రజల కోరిక మేరకు పంచాయతీలో పలు సీసీ రోడ్ల నిర్మాణాన్ని జనవరి నెలాఖరులోగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. తాగునీరు, సాగునీటి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వాల్మీకుల కులధ్రువీకరణ ప్రతాల సమస్య సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెట్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, వైస్‌ఎంపీపీ జుర్రా రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్ రాజు, సర్పంచ్‌లు కించు వెంకటలక్ష్మి, కొంగర మురళీకృష్ణ, చీడి శివ, సవిరెల చంద్రుడు, దాసరి నాగేశ్వరరావు, తొంటా ఆదిరాజు, సత్యనారాయణ, గణలక్ష్మి, సత్యవతి, భీంరెడ్డి శుభలక్ష్మి, ఆగూరి శుభలక్ష్మి, నాయకులు సింగిరెడ్డి రవి, ఆడపా కామేష్, చీడిపల్లి అప్పారావు, కనిగిరి వీరబాబు, జుర్రా జాన్‌బాబు, అర్జబాబు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఏపీఎం ఆదినారాయణ, సీఐ బాజీలాల్, జడ్డంగి ఎస్‌ఐ రఘునాథరావు, ఎస్‌హెచ్‌వో గోపీ నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సచివాలయ, రైతు భరోసా కేంద్ర భవనాలు ప్రారంభం

అమీనాబాద్‌లో రూ.35లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. గిరిజనసంక్షేమ శాఖ డీఈ గౌతమి, ఏఈ వీరభద్రరావు, వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ, రైతు భరోసా భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

మహిళా పోలీసులు అంగన్‌వాడీలను సందర్శించాలి

ఎంపీడీవో ఉమామహేశ్వరరావు


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను సందర్శించి పారిశుధ్యంతో పాటు ఇతర అంశాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. బాలికలకు ఎదురయ్యే సమస్యలపై చర్చించి సూచనలు ఇవ్వాలన్నారు. సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. తాగునీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి విధిగా శుభ్రం చేయించాలని సూచించారు. ఇంటి పన్ను వసూలును ప్రతి ఏడాది ఐదు శాతం పెంచాలని చెప్పారు. కొత్తగా నిర్మాణం చేసిన గృహాలను నమోదు చేసి వాటికి నంబర్లు కేటాయించాలని సూచించారు. ఈవోఆర్‌డీ పాపారావు, సీడీపీవో లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి అరకులోయ విద్యార్థులు



డిగ్రీ కళాశాల విద్యార్థులతో ప్రిన్సిపాళ్లు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు

అరకులోయటౌన్: ఢిల్లీలో జరిగే నా భూమి, నా దేశం కార్యక్రమంలో పాల్గొనేందుకు స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు వెళ్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ తెలిపారు. వివిధ గ్రామాల్లో సేకరించిన మట్టిని అమృత కలశంలో నింపేందుకు ఈనెల 30, 31 తేదీల్లో 12 మంది విద్యార్థులు వెళ్తున్నారని చెప్పారు. తమ కళాశాల విద్యార్థులకు ఇటువంటి అవకాశం రావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ జి.మహేశ్వరరావు, అల్లూరి జిల్లా మానటరింగ్ ఆఫీసర్ వి.మురళి, ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, వై. విజయ లక్ష్మి, ఎం.అనిత కుమారి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


సరియలబంద గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సన్యాసిదొర



రోడ్డును ప్రారంభిస్తున్న ప్రజా ప్రతి నిధులు

జి.మాడుగుల: మండలంలోని పెద లువ్వాసింగి పంచాయతీ సరియలబంద గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర ప్రారంభించారు. సరియలబంద గ్రామస్తుల వినతి మేరకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక చొరవతో రూ.22 లక్షలు మంజూరైనట్టు ఎంపీటీసీ తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామంలోని రోడ్డు సమస్య తీరుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు, సచివాలయ మండల కన్వీనర్ ఎల్.కళ్యాణం, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పాంగి రామకృష్ణ, వైస్ సర్పంచ్ గబ్బాడి గణపతి, సింగర్భ సచివాలయ కన్వీనర్ సూర్యప్రకాష్‌నాయుడు, ఏఎంసీ డైరెక్టర్ అడపా బాబూరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉమారాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ శివపడాల్ తదితరులు పాల్గొన్నారు.

కింకెఱరాయిలో రోడ్డు ప్రారంభం

వై.రామవరం: మండలంలోని కింకెఱరాయి గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం ప్రారంభించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీలు వీరమళ్ళ సుబ్బలక్ష్మి, సాదాల లక్ష్మి, సర్పంచ్‌లు పి.బాలురెడ్డి, ఎం. నూకరాజు, పి.రాజేశ్వరి, తదితరులు మాట్లాడుతూ మండల ఎగువప్రాంతలో మరిన్ని రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలో వాటికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా, మండల వైఎస్సార్‌సీపీ నేతలు జి.త్రిమూర్తులు, కె. కనకరాజు, బి.నూకరాజు, పి.తమ్మిరెడ్డి, భారతిబాబు,ఎం. నారాయణ రావు, కెజవి జయకుమార్, పి.పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతల్లో జీసీసీ కాఫీ కొనుగోలు కేంద్రాలు


మాట్లాడుతున్న జీసీసీ బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరావు


సేల్స్‌మెన్లకు అవగాహన కల్పిస్తున్న జీసీసీ బ్రాంచ్ మేనేజర్ మురళీకృష్ణ

దుంబ్రిగుడ: దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకు మండలంలోని అరకు, సుంకరమెట్ట,కించుమండ వారపు సంతల్లో జీసీసీ ద్వారా కాటాలను ఏర్పాటు చేసి కాఫీ కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచుతామని అరకు జీసీసీ బ్రాంచ్‌మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం చెప్పారు. కాఫీ పండ్లకు ప్రభుత్వం మంచి ధర కల్పిస్తోందని, గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నా. దళారులను నమ్మిమోసపోద్దని తెలిపారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు

అనంతగిరి: దళారులకు కాఫీ గింజలు విక్రయించి మోసపోవద్దని గిరిజన రైతులకు జీసీసీ కాశీపట్నం బ్రాంచ్ మేనేజర్ మురళీకృష్ణ సూచించారు. మండలంలోని కాశీపట్నం బ్రాంచ్‌లోని శుక్రవారం సెల్స్‌మెన్లకు కాఫీ కొనుగోలుపై పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2020-24 సంబంధించి అపెక్స్ కమిటీ నిర్ణయించిన ధరకే జీసీసీ కాఫీని కొనుగోలుచేస్తుందని చెప్పారు. దళారులు తూకాల్లో మోసాలకు పాల్పడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెల్స్‌మెన్ అప్పన్నదొర, అకౌంటెంట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ కృష్ణవంశీ

గూడెంకొత్తవీధి: బడిశాల గ్రామంలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శుక్రవారం పెదవలస సర్పంచ్ కృష్ణవంశీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ విరోధి త్రిమూర్తులు, మండల కో కన్వీనర్ రమేష్, వార్డు సభ్యులు త్రినాథ్, నాయకులు మల్లేశ్వరావు,బిరుసు రంగారావు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి


బాబునగర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శివకుమార్

మోతుగుడెం: అసాంఘిక కార్యకలాపాలకు అందరూ దూరంగా ఉండాలని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబూ నగర్, విల్లర్థి గ్రామాల్లో శుక్రవారం ఆయన అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గంజాయి సాగు, విక్రయం, రవాణా, సారా తయారీ, విక్రయాలు చేయడం చట్టరీత్యానేరమని వీటికి దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు చేయకూడదని చెప్పారు. మావోయిస్టులకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. గంజాయికి సంబంధించి ఏ విషయం తెలిసినా 9381123100 అనే నంబర్‌కు కాల్ చేసి చెప్పాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని, పారితోషికం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శ్రీను, నాగరాజు, పోసియ్యా, కన్నప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు


అధికలోడుతో వస్తున్న వాహనాలను పరిశీలిస్తున్న సీఐ రమేష్

చింతపల్లిరూరల్: అధిక లోడుతో వాహనాలు నడపడం ప్రమాదకరమని సీఐ రమేష్ తెలిపారు. మండలంలోని లోతుగడ్డ జంక్షన్,లంబసింగిలలో శుక్రవారం విస్తృతంగా వాహనతనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిర్ణీత పరిమితిని మించి లోడును తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని చెప్పారు. ఎస్ఐ అరుణ్ కిరణ్ పాల్గొన్నారు.

జీపు ప్రమాద బాధితులకు పరామర్శ


క్షతగాత్రులను పరామర్శిస్తున్న కోడా సింహాద్రి

పెదబయలు: మండలంలోని పెదకోడాపల్లి ఘాట్ రోడ్డులో గురువారం జీపు బోల్తా పడిన ప్రమాదంలో గాయపడి పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని శుక్రవారం వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రతినిధి కోడా సింహాద్రి పరామర్శించారు. చికిత్స పొందుతున్న కిముడుపల్లి పంచాయతీ పులిగొంది గ్రామానికి చెందిన పాంగి పొట్టన్న,పాంగి రాజన్న,పాంగి కామరాజు, వంతర్ల గ్రామానికి చెందిన వంతాల పవన్‌లను పరామర్శించి, మెరుగైన వైద్యం అందజేయాలని డాక్టర్లను కోరారు. ఆయన వెంట ఉద్యోగ సంఘ నాయకులు టి.రాంనాయుడు, కె.రవికాంత్‌నాయుడు, కృష్ణమోహన్,దాసుబాబు తదితరులున్నారు.

పలకలు, నోట్ పుస్తకాల పంపిణీ


పలకలు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ భాగ్యవతి

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు పంచాయతీ పోతురాజుపుట్టు పాఠశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థులకు జర్రెల సర్పంచ్ బొగ్గం భాగ్యవతి శుక్రవారం పలకలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


జడ్డంగిలో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్న పోలీసు అధికారులు


గంగవరం స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్న పోలీసులు

చింతపల్లి: ఆయుధాల వినియోగంపై శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పలు పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ ఆయుధాల వినియోగంపై అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశాల మేరకు సీఐ రమేష్, ఎస్ఐ అరుణ్ కిరణ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

జడ్డంగిలో..

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి స్టేషన్‌లో సీఐ బాజీలాల్ ఆధ్వర్యంలో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసుల విధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జడ్డంగి, దోనెలపాలెం, బోర్నగూడెం, లోతావారి వీధి పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాల పని తీరును వివరించారు. ఎస్ఐ రఘునాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం స్టేషన్‌లో...

గంగవరం : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు ఓపెన్ హౌస్ నిర్వహించారు. శుక్రవారం పోలీసుస్టేషన్‌లో స్టేషన్, రికార్డుల నిర్వహణ, అధికారులు, సిబ్బంది విధులు, బాధ్యతలపై ఎస్ఐ రామకృష్ణ, అడిషినల్ ఎస్ఐ కేబీఆర్ రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమబాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం ఝాన్సీహేన్సన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.